ఆటో యూనియన్ కామారెడ్డి జేఏసీ ఎన్నిక

మాచారెడ్డి, డిసెంబర్ 27 : మాచారెడ్డి మండల కేంద్రంలోని షబ్బీర్‌అలీ ఫంక్షన్‌హాల్‌లో ఐదుగురు సభ్యులతో కూడిన కామారెడ్డి నియోజకవర్గస్థాయి ఆటో యూనియన్ జేఏసీని బుధవారం ఎన్నుకున్నారు. మాచారెడ్డి మండలానికి మల్లేశ్, బీబీపేటకు స్వామిగౌడ్, భిక్కనూర్‌కు లింగం, పాల్వంచకు మైసయ్య, కామారెడ్డి రూరల్‌కు స్వామితోపాటు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రాజిరెడ్డిని నియమించినట్లు జిల్లా జేఏసీ అధ్యక్షుడు బోదాసు నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ డైరెక్టర్ కృష్ణంరాజు, కార్యదర్శి కృష్ణ ఆయా మండలాలకు చెందిన యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కోసం అదనంగా బస్సులు నడపాలి

కామారెడ్డి, డిసెంబర్ 27 : విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడపాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ కోరారు. ఈ మేరకు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో రద్దీ పెరిగిందని, సరైన సమయంలో బస్సులు రాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నందున విద్యార్థుల కోసం అదనంగా బస్సులు నడపాలని కోరారు. నగర కార్యదర్శి చరణ్, హాస్టల్స్ జిల్లా కన్వీనర్ ఖలీల్, నవీన్, అల్తాఫ్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

బీబీపేట్, డిసెంబర్ 27: మండలంలోని యాడారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణాగౌడ్, సిబ్బంది బుధవారం ఇంటిపన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇంటిపన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

- జనవరి 6వ తేదీ వరకు గ్రామ సభలు
- వంద కుటుంబాలకు ఒక కౌంటర్
- సిబ్బందికి అవగాహన కల్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

బాన్సువాడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భుజంగరావు

కామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వార్డు సూపర్‌వైజర్లు, టీం లీడర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 27: ఆరు గ్యారెంటీల అమలు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నేటి(గురువారం) నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. అన్ని గ్రామాలతో పాటు మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మరో గ్రామంలో సభను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు బుధవారం సిబ్బందితో సమావేశాలు నిర్వహించి గ్రామ సభలు, దరఖాస్తుల నిర్వహణపై వారికి అవగాహన కల్పించారు. దరఖాస్తు ఫారంతోపాటు తెల్లరేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్ ప్రతులను తప్పని సరిగా జత చేయాలని సూచించారు. దరఖాస్తులను ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గాంధారిలో తహసీల్దార్ జానకీ, ఎంపీడీవో సతీశ్ ఆధ్వర్యంలో, పిట్లంలో ఎంపీడీవో వెంకటేశ్వర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, రామారెడ్డిలో ఎంపీడీవో సవితారెడ్డి, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సదాశివనగర్‌లో ఎంపీడీవో లక్ష్మి, తహసీల్దార్ హిమబిందు, ఎంపీపీ అనసూయ, జడ్పీటీసీ నర్సింహులు, బిచ్కుందలో డీఎల్పీవో శ్రీనివాస్ ప్రజాపాలనపై అవగాహన కల్పించారు. కామారెడ్డి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, బాన్సువాడలో ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీపీ నీరజ ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో సమావేశాలు కొనసాగాయి. ఉమ్మడి మాచారెడ్డి మండలంలో డీఎల్పీవో సాయిబాబా, ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్లు శ్వేత, జయంత్‌రెడ్డి, దోమకొండలో ఎంపీపీ శారద, జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో చిన్నారెడ్డి అవగాహన కల్పించారు. బీబీపేట్‌లో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలామణి, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, నస్రుల్లాబాద్‌లో ఎంపీపీ విఠల్ తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, రాజంపేట్‌లో ఎంపీడీవో బాలకిషన్ తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు.

ప్రజాపాలన సభలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ మనూ చౌదరి

కామారెడ్డి, డిసెంబర్ 27 : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మనూ చౌదరి ఆదేశించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రజలకు పాలనను చేరువ చేయడంతోపాటు అర్హులకు దశల వారీగా, నిర్ణీత కాల వ్యవధిలో సామాజిక భద్రతా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో సభలు నిర్వహించి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, అవసరమైన మేర పోలీసు బందోబస్తు సహకారం తీసుకోవాలన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

- ఎస్సీ సింధూశర్మ

కామారెడ్డి, డిసెంబర్ 27 : పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఉదయం, రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని ఎస్సీ సింధూశర్మ తెలిపారు. వాహనదారులు జాగ్రతలు పాటించాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. హెడ్‌లైట్లు తక్కువ దూరంలో ఉండేలా చూసుకోవాలని, తప్పనిసరిగా ఇండికేటర్లు, హార్న్ ఉపయోగించాలని పేర్కొన్నారు. వాహనాన్ని మలుపు తిప్పేటప్పుడు కనీసం పది సెకన్లపాటు సూచన ఇవ్వాలని, వాహనాల మధ్య నిర్ణీత దూరం పాటించాలని, ఓవర్‌టేక్‌తో ప్రమాదాలు జరుగుతాయని వివరించారు. ట్రాఫిక్, వాతావరణ పరిస్థితులు అనుకూలించనప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హాస్టల్స్ కన్వీనర్‌గా ఖలీల్

మాచారెడ్డి, డిసెంబర్ 27 : ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్‌గా మండలానికి చెందిన ఖలీల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేస్తామన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ, డిసెంబర్ 27: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి సూచించారు. భాగంగా మండలంలోని లింగుపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొని మాట్లాడారు. పేదల కోసం ప్రధాని మోదీ ముద్ర రుణాలు, ఇన్సూరెన్స్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలు తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ -2024 క్యాలెండర్లను పంపిణీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి

అభినందన..

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని బాన్సువాడ పట్టణం, తాడ్కోల్ గ్రామానికి చెందిన గౌడ కులస్తులు బుధవారం కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. -బాన్సువాడ టౌన్, డిసెంబర్ 27

సాదా సీదాగా.. బీర్కూర్ మండల సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జనార్దన్

నస్రుల్లాబాద్, డిసెంబర్ 27: ఎంపీపీ రఘు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బీర్కూర్ మండల సర్వసభ్య సమావేశం సాదా సీదాగా కొనసాగింది. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్యుత్తు, ఉపాధిహామీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా అవసరాల కోసం మంజీర నుంచి ఇసుక కావాలని కోరగా, ప్రభుత్వ అనుమతులు రాగానే ఇస్తామని తహసీల్దార్ జనార్దన్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో భాను ప్రకాశ్, ఎస్సై నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-కామర్స్, డిజిటల్ ట్రేడ్‌పై అవగాహన

మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు

కామారెడ్డి, డిసెంబర్ 27: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ-కామర్స్, డిజిటల్ ట్రేడ్, వినియోగదారుల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మల్లికార్జునబాబు మాట్లాడుతూ.. గుర్తింపు కలిగిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నుంచే వస్తువులు కొనుగోలు చేయాలని, బహుమతులు, డిస్కౌంట్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. డిజిటల్ లావాదేవీలు, సమాచార మార్పిడీ సమయంలో స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. కొత్త వినియోగదారుల రక్షణ చట్టం-2019 పై అవగాహన పెంచుకోవాలని, సమస్యల పరిష్కారానికి 180042500333/1967 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. కార్మిక శాఖ జిల్లా అధికారి సురేంద్రకుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, డీఈవో రాజు, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, వినియోగదారుల సంఘాల సమైక్య అధ్యక్షురాలు సువర్ణ, చంద్రశేఖర్, రేషన్ డీలర్స్, గ్యాస్ ఏజెన్సీలు, రైస్‌మిలర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలన, అభయహస్తం గ్రామ సభలు ఇలా..

నిజాంసాగర్‌లో దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి గంగారాం

సదాశివనగర్, డిసెంబర్ 27: మండలంలో నిర్వహించే ప్రజాపాలన, అభయహస్తం గ్రామ సభల వివరాలను ఎంపీడీవో లక్ష్మి, తహసీల్దార్ హిమాబిందు తెలిపారు. 28న అడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివనగర్, 29న వజ్జపల్లి కలాన్, ధర్మారావుపేట్, దగ్గి, అమర్లబండ, 30న మర్కల్, కుప్రియాల్, కల్వరాల్, పద్మాజివాడి, జనవరి 2న లింగంపల్లి, జనగామ, భూంపల్లి, మోడెగామ, 3న యాచారం, లక్ష్మీనాయక్ తండా, తుక్కోజివాడి, తిమ్మోజివాడి, 4న ఉత్తునూర్, వజ్జపల్లి తండా, సజ్జనాయక్ తండా, పూర్యానాయక్ తండా, 5న మల్లుపేట్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన సభలు ఉంటాయని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిజాంసాగర్ మండలంలో..

నిజాంసాగర్, డిసెంబర్ 27: మండలవ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభల వివరాలను అధికారులు వెల్లడించారు. ఈనెల 28న మహ్మద్‌నగర్, అచ్చంపేట, బంజపల్లి, 29న కొమలంచ, ఆరేపల్లి, మల్లూర్, 30న సింగీతం, గోర్గల్, వొడ్డేపల్లి, జనవరి 2వ తేదీన నర్వ, మాగి, వెల్గనూర్, 3న తున్కిపల్లి, జక్కాపూర్, మల్లూర్‌తండా, నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్, 4న దూప్‌సింగ్‌తండా, గిర్నితండా, మగ్దుంపూర్, బ్రాహ్మణపల్లి, 5న గాలిపూర్, గున్కుల్, హసన్‌పల్లి, 6న బుర్గుల్, తెల్గాపూర్, సుల్తాన్‌నగర్ గ్రామాల్లో సభలను నిర్వహించనున్నారు. గ్రామసభ నిర్వహించే ముందు రోజు ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలని, దరఖాస్తు చేసేందుకు వచ్చిన మహిళల కోసం ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గ్రామస్థాయి అధికారులకు ఆదేశించింది. గ్రామ సభలు శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. తాగునీరు, క్యూలైన్లు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజాపాలన దరఖాస్తు ఫారాల అందజేత

ప్రభుత్వ ఆదేశాల మేరకు అభయహస్తం, ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి గంగారాం ఇంటింటికీ తిరుగుతూ అందజేసి, ఫారాన్ని అంశాల వారీగా భర్తీ చేసి గురువారం నిర్వహించే గ్రామ సభలో అందజేయాలని సూచించారు. కారోబార్ సాయిలు, వార్డు సభ్యుడు ఏసయ్య తదితరులు ఉన్నారు.

విఠలేశ్వర ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న హస్నాపూర్ గ్రామస్తులు

పిట్లం, డిసెంబర్ 27: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో విఠలేశ్వర ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన నీరుడి గంగారాం భూదాతగా నిలవడంతో ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సాయిరెడ్డి, కాశీరాం, గోపాల్‌రెడ్డి, దత్తు, శ్రీకాంత్, నీరుడి గోపాల్, సంతోష్ మేస్త్రీ, రహిమతుల్లా పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అర్హులందరికీ గ్యారంటీలు అందేలా చూడాలి

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- మండలాధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, డిసెంబర్ 27: అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందేలా చర్యలు తీసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మద్నూర్‌లోని రైతువేదికలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. నిరక్షరాస్యుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి పూర్తి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో దండోరాలు వేయించి, అందరికీ సమాచారం అందజేసి, దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయా గౌడ్, డీఎల్పీవో శ్రీనివాస్, తహసీల్దార్ ముజీబ్, సీడీపీవో సునంద, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎస్సైలు, వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 27: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మండలానికి మొదటిసారి వచ్చిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బేగంపూర్ చౌరస్తా నుంచి పెద్ద కొడప్‌గల్ బస్టాండ్ మీదుగా పాప హరేశ్వర మందిరం వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ సభాస్థలి వరకు ర్యాలీతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిబాబా, నాయకులు కుర్లెపు హన్మాండ్లు, శామప్ప పటేల్, మల్లప్ప పటేల్, చిప్పె నారాయణ, మోహన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లలో అధికారులు బిజీబిజీ..

మద్నూర్, డిసెంబర్ 27: మద్నూర్‌లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రజాపాలన సమావేశం నిర్వహిస్తున్న సమయం లో చాలా మంది అధికారులు సెల్‌ఫోన్లలో నిమగ్నమయ్యారు. కొందరు అధికారులు తమకేమీ పట్టనట్టుగా కనిపించారు.

రామారెడ్డి పీహెచ్‌సీని సందర్శించిన ఢిల్లీ బృందం

రామారెడ్డి, డిసెంబర్ 27: రామారెడ్డి మండల కేంద్రంలో గల ప్రభుత్వ దవాఖానను బుధవారం ఢిల్లీ బృందం సందర్శించింది. నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షకులు(ఎన్‌క్యూఏఎస్) రోణక్‌శర్మ, డాక్టర్ పవంతన్ దవాఖాన పరిసరాలను పరిశీలించారు. దవాఖానలోని ఇన్, అవుట్ పేషెంట్ గదులు, లేబర్ రూమ్ ల్యాబొరేటరీ, టీబీ, లెప్రసీ సెంటర్లను క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు సేకరించారు. జాతీయ ఆరోగ్య పథకాలు, రోగుల రికార్డు షీట్లు, దవాఖాన పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు చంద్రశేఖర్, శోభారాణి, జహీరా బేగం, డీపీవో పద్మజా, రామారెడ్డి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దవాఖాన పరిసరాలను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

అయోధ్య అక్షింతల శోభాయాత్ర

సదాశివనగర్, డిసెంబర్ 27: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల శోభాయాత్రను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు అక్షింతల రథానికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కొప్పుల నర్సారెడ్డి, నవీన్ రెడ్డి, కటికె రమేశ్, సతీశ్, యోగి, సాయి, ప్రశాంత్, కోమటి నరేందర్ గుప్తా, జనగామ ప్రభాకర్ రెడ్డి, సాయిలు, అవుసుల చంద్రశేఖర్ చారి, డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలతో భక్తులు

సౌత్ జోన్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

గాంధారి, డిసెంబర్ 27: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు మండలంలోని బామన్ నాయక్ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన ముగ్గురు క్రీడాకారిణిలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ బుధవారం తెలిపారు. మండలంలోని పొతంగల్ కలాన్‌కు చెందిన ప్రణీత, త్రివేణి, సింధూజ ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారని పేర్కొన్నారు. దీంతో వారిని నిర్వాహకులు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న పద్మావతి యూనివర్సిటీలో నేటి(గురువారం) నుంచి నిర్వహించే పోటీల్లో తెలంగాణ యూనివర్సిటీ జట్టు తరపున వారు పాల్గొంటారని అన్నారు. క్రీడాకారిణులను బామన్ నాయక్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు గుగ్లోత్ సురేందర్, చైర్మన్ సెవంత రాథోడ్‌తో పాటు గ్రామస్తులు, తోటివిద్యార్థులు అభినందించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు..

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 27: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలకు చెందిన గౌతమ్ ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కృతమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి ఎంపికకు గాను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ లింగం, పీఈటీ నిఖిల్ కృషి ఎంతో ఉందని కొనియాడారు. గౌతంను అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

31న నరేంద్ర మహరాజ్ రాక

నిజాంసాగర్, డిసెంబర్ 27: జుక్కల్ మండలంలోని దోస్తుపల్లి, బంగారుపల్లి శివారులో ఉన్న తెలంగాణ ఉప పీఠానికి విభూషిత జగద్గురు రామానందచార్య స్వామి నరేంద్ర మహరాజ్ వస్తున్నారని ఆయన శిష్యులు తెలిపారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు, పోస్టర్లను అందజేశారు. నరేంద్ర మహారాజ్ స్వామితోపాటు ఉత్తరాధికారి కాణిఫ్‌నాథ్ మహరాజ్ కూడా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పందులకు స్వైన్‌ఫ్లూ నివారణ టీకాలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 27: పందులకు స్వైన్ ఫ్లూ రాకుండా ఉండేందుకు టీకాలు ఇస్తున్నట్లు వెటర్నరీ ఏడీ సుభాష్ తెలిపారు. ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో బుధవారం పందులకు స్వైన్‌ఫ్లూ నివారణ టీకాలను ఇచ్చారు. గ్రామంలోని 18 పెంపుడు పందులకు టీకాలు వేసి, వాటి యజమానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ అర్చన, గోపాలమిత్ర మహబూబ్, సిబ్బంది శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నిజాంసాగర్, డిసెంబర్ 27: జుక్కల్‌లోని మార్కండేయ మందిరంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఆంజనేయస్వామి, యమధర్మరాజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం సంపూర్ణమయ్యాయి. బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మోషంపూర్‌లో కార్డన్‌సెర్చ్

రామారెడ్డి, డిసెంబర్ 27: మండలంలోని మోషంపూర్‌లో కామారెడ్డి డీఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని వాహనాల ధ్రువపత్రాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దని సూచించారు. ఫోన్‌లో వచ్చే గుర్తు తెలియని లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజూలా కిషన్‌గౌడ్, రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, రామారెడ్డి, దేవునిపల్లి ఎస్సైలు సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.